YEAR HAPPY WORK ANNIVERSARY...

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

సంపుటి : 2 సంచిక : 27 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 9 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 27 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 9 Decmbar 2024 PAGES : 8 PRICE : 5/-



# దూకుడే బలం

### బలహీనతగా మారకుండా చూసుకోవాలి

### త్యాగాలకు సిద్ధమయి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే తన ధ్యేయమని చెప్పిన పవన్ కల్యాణ్ అన్న మాట ప్రకారం నిలబెట్టుకున్నారు

### సీట్లు చూడలేదు. కేంద్రంలో మంత్రి పదవులు ఆశించలేదు.

### రాష్ట్రంలో మంత్రి పదవులు ఇన్ని ఇచ్చారన్న అసంతృప్తి ఎంత మాత్రం లేదు.

**కాకినాడ**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ సుదీర్ఘ కల నెరవేరింది. ఆయన అనుకున్నది అనుకున్నట్లుగానే ఈ ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించాయి. త్యాగాలకు సిద్ధమయి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే తన ధ్యేయమని చెప్పిన పవన్ కల్యాణ్ అన్న మాట ప్రకారం నిలబెట్టుకున్నారు. సీట్లు చూడలేదు. కేంద్రంలో మంత్రి పదవులు ఆశించలేదు. రాష్ట్రంలో మంత్రి పదవులు ఇన్ని ఇచ్చారన్న అసంతృప్తి ఎంత మాత్రం లేదు. ప్రజలకు ఏదో చేయాలన్న తపనతోనే పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారని ఆయన సన్నిహితులు కూడా చెబుతున్నారు. దీంతోపాటు ఈ ఎన్నికల్లో నెగ్గడానికి తనకంటూ ఒక వ్యూహం ఉందని చెప్పిన పవన్ కల్యాణ్ అంతా తన వ్యూహం ప్రకారమే ముందుకు వెళ్లారు. ఎన్ని సీట్లు తీసుకున్నామన్నది కాదని, ఎన్ని గెలిచామన్న ఆయన మాటను నిజం చేస్తూ స్ట్రయికింగ్ రేటు వంద శాతం వచ్చింది.మొన్నటి ఎన్నికల్లో జనసేన 21 స్థానాల్లో బరిలోకి దిగి అన్నింటిలో విజయం సాధించడంలో పవన్ కల్యాణ్ పాత్రను ఎవరూ కాదనలేరు. కూటమి విజయంలో ఆయన పోషించిన భూమికను కూడా ఎవరూ తోసిపుచ్చలేరు. ఎందుకంటే ఎన్ని విమర్శలు వచ్చినా.. ఎన్ని ట్రోలింగ్ లు ఎదురయినా సరే పవన్ కల్యాణ్ మాత్రం అదరలేదు. బెదరలేదు. లక్ష్యం వైపు చూశారు. దానినే గురి చూసి కొట్టగలిగారు. సరే ఉప ముఖ్యమంత్రి పదవి వచ్చిందని సంతోషపడాలా? లేదా? అన్నది పక్కన పెడితే ఆయన అసలు టార్గెట్ మాత్రం రీచ్ అయినట్లే అని అనుకోవాలి. ఎందుకంటే ఆయన పార్టీని పదేళ్ల నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. ఎందరో - మిగతా3లో



## వారి నుంచి అణాపైసలతో సహా రాబడుతాం

- మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి వార్నింగ్
- గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ నేతలు వ్యవస్థలను నిర్వీర్యం చేశారు
- జగన్ ప్రభుత్వ అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరుతాం
- అధికారుల పనితీరు మారకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**చిత్తూరు**

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాధనం దోచుకున్న వారి నుంచి అణా పైసలతో సహా రాబడతామని చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ నేతలు వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరుతామని అన్నారు. - మిగతా3లో

## పబ్లిసిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు



- ఈ స్టంట్స్ చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంది
- తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన వైసీపీ అధినేత జగన్
- పేరెంట్-టీచర్ సమావేశాలు ఎప్పటినుంచో జరుగుతున్నాయని వెల్లడి
- కూటమి ప్రభుత్వం పేరుమార్చి ప్రచారం చేసుకుంటోందని ఆగ్రహం
- ఈ ప్రపంచంలో ఒక్క చంద్రబాబు మాత్రమే ఇలాంటి మోసాలు చేయగలరు
- ఇంతటి నటనా కౌశల్యం చంద్రబాబుకే సొంతం"
- సిగ్గనిపించడం లేదా? అంటూ ఫైర్

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పబ్లిసిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ట్విట్టర్(ఎక్స్) వేదికగా జగన్ ట్వీట్ చేశారు. "సహజంగా ప్రతి స్కూల్లో జరిగే పేరెంట్స్ కమిటీ సమావేశాల పేరు మార్చి, ఆ సమావేశాలు ఏదో ఇప్పుడే జరుగుతున్నట్లుగా, వాటిని ప్రచార వేదికలుగా మార్చుకుని సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం చేస్తున్న స్టంట్స్ చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎంతో కష్టపడి తీర్చిదిద్దిన ప్రభుత్వ స్కూళ్లను, విద్యారంగాన్ని ఒకవైపు నాశనం చేస్తూ, అమ్మకు వందనం పేరిట తల్లిదండ్రులకు సున్నం రాసి, వారిని దగాచేసి, మళ్లీ ఇప్పుడు రొటీన్‌గా జరిగే పేరెంట్స్ సమావేశాలపై పబ్లిసిటీ చేయించుకోవడం, ఈ ప్రపంచంలో ఒక్క - మిగతా3లో



## ప్రతిపక్షాలు ప్రజాతీర్పును స్వాగతించాలి

- డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే
- ఓడినప్పుడల్లా ఈవీఎంలను తప్పుపట్టడం వారికి అలవాటుగా మారింది
- మహారాష్ట్ర ప్రజలు ఇచ్చిన స్పష్టమైన మెజారిటీని ప్రతిపక్షాలు స్వాగతించాలి
- గడిచిన రెండేళ్ల మహాయుతి కూటమి పాలనలో ఎన్నో పనులు చేశాం
- ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశాం

## రంగంలోకి ఈగల్



- కాకినాడ పోర్ట్ వ్యవహారంలో అన్నీ తెలుస్తున్నాయి
- విశాఖ రోడ్డు ఆక్సిడెంట్ బాధితులు సహకార కేంద్రం ప్రారంభించాం
- విజయ్ సాయి రెడ్డి మాటలు దుర్మార్గం
- హెూం మంత్రి వంగలపూడి అనిత
- శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేదు
- ద్వారకా తిరుమలరావు రాష్ట్ర డిజిపి

**విశాఖపట్నం**

గంజాయి నిరోధానికి ఏర్పాటైన' ఈగల్ ' వ్యవస్థ అప్పుడే రంగంలోకి దిగిందనీ హెూం శాఖ మంత్రి అనిత వెల్లడించారు. విశాఖలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కాకినాడ పోర్ట్ వ్యవహారంలో అన్నీ తెలుస్తున్నాయి. 2018లో అప్పటి హెూం మంత్రి చిన్నరాజప్ప చేతులు మీద భూమి పూజ జరిగిన ఆరిలోవా పోలీస్ స్టేషన్ కు ఈ రోజు కూటమి ప్రభుత్వమే ప్రారంభించింది. విశాఖ రోడ్డు ఆక్సిడెంట్ బాదితులు సహకార కేంద్రం ప్రారంభించాం. విశాఖలో రోడ్డు ప్రమాదాలలో బాధితులకు సహకారం అందించే కేంద్రం రోడ్డు ప్రమాద బాధితులు సహాయంకు 7995095793 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశాం. కొన్ని ఇన్స్యూరెన్స్ పాలిసి మార్పు రావాలి. అందుకే ఈ పాలసీ మార్పు మీద దృష్టి పెడుతున్నాం. ఆటోలు వల్ల - మిగతా3లో



## వారిపై నిందలు మోపిన దుర్మార్గుడు జగన్

- మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం
- ఆడపిల్లలే జాతికి నిజమైన సంపద
- ఆ సంపదను కాపాడుకోవటానికి ప్రతిఒక్కరూ కలసి రావాలని
- ఇంటికి పెద్దన్న అవుతానంటూనే సొంత తల్లి , చెల్లెళ్లకే న్యాయం చేయలేదు



## యాంటీ డ్రోన్ విభాగంతో శత్రు దుర్భేద్యంగా సరిహద్దులు

- డ్రోన్ల అనుమానాస్పద కదలికలు భద్రతా దళాలకు సవాళ్లు విసురుతున్నందున దీనిని సమర్ధవంగా ప్రభుత్వం ఎదుర్కొంటుంది
- సరిహద్దుల్లో భద్రతను పెంచేందుకు సమగ్ర డ్రోన్ నిరోధక విభాగాన్ని త్వరలోనే ఏర్పాటు
- ఇండియా-బంగ్లాదేశ్, ఇండియా-పాకస్థాన్ సరిహద్దులను శత్రుదుర్భేద్యం చేసేందుకు సీబీబీఎంఎస్ పురోగతిలో ఉంది
- వీవీపీను దేశంలోని అన్ని సరిహద్దు పల్లెలకు విస్తరిస్తాం

# పబ్లిసిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు మాత్రమే ఇలాంటి మోసాలు చేయగలరు. ఇంతటి నటనా కౌశల్యం చంద్రబాబుకే సొంతం" అని జగన్ విమర్శించారు.

**వైసీపీ ప్రభుత్వంలో విద్యారంగానికి పూర్తి జవసత్వాలు**

"టీచర్లు- విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు కొత్తేమీ కాదు. క్రమం తప్పకుండా గతంలోనుంచీ జరుగుతున్నవే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ విద్యారంగానికి పూర్తి జవసత్వాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ప్రతి విప్లవాత్మక మార్పులోనూ, అమలు చేసిన ప్రతి సంస్కరణలోనూ పిల్లల తల్లిదండ్రుల ఆలోచనలు, వారి భాగస్వామ్యాన్ని తీసుకున్నాం. 15,715 పాఠశాల్లో మొదటి విడత, 22,344 పాఠశాలల్లో మలివిడత నాడు-నేడు పనులన్నీ తల్లిదండ్రుల కమిటీల భాగస్వామ్యంతోనే జరిగాయి. అప్పట్లో పిల్లలందరికీ ఇంగ్లిషు మీడియంలో బోధన చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా పేరెంట్స్ కమిటీలు సంపూర్ణంగా ఆమోదించి తీర్మానాలు చేశాయి. ప్రభుత్వ స్కూళ్లలో టాయిలెట్స్ మెయింటనెన్స్ ఫండ్, స్కూల్ మెయింటినెన్స్ ఫండ్ నిర్వహణలో తల్లిదండ్రులదే ముఖ్య భూమిక. ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లల భవిష్యత్తును ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడంలో ఈవిధంగా తల్లిదండ్రులు తమ వంతు పాత్ర పోషించారు. ఇప్పుడు ఈ సమావేశాలకు కొత్త టైటిల్స్ పెట్టి, ఓవైపు విద్యారంగాన్ని నాశనంచేస్తూ, మరోవైపు తామేదో కొత్తగా చేస్తున్నామనే భ్రమ కల్పించడానికి చంద్రబాబుగారు, ఆయన నాయకులు ప్రయత్నిస్తున్నారు. మరొక విశేషం ఏంటంటే.. పేరెంట్స్ కమిటీ సమావేశాలకు దాతలనుంచి చందాలు, సామగ్రిని తీసుకోవాలని ఏకంగా సర్క్యులర్ పంపడం" అని తెలిపారు.

**సూపర్ సిక్స్ పేరిట డప్పు కొట్టారు**

"మేం అమ్మఒడి కింద ప్రతి తల్లికీ ఏడాదికి రూ.15వేల చొప్పున, క్రమం తప్పకుండా 44.49 లక్షల మంది తల్లులకు రూ. 26,067 కోట్లు ఇచ్చాం. నీకు రూ.15వేలు, నీకు 15వేలు, నీకు రూ.15వేలు అంటూ చంద్రబాబు సహా కూటమి పార్టీల నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15వేల చొప్పున ఇస్తామన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఊరూరా, ప్రతి ఇంటికీ డప్పు కొట్టారు. ఇద్దరు పిల్లుంటే రూ.30వేలు అన్నారు,



ముగ్గురు ఉంటే రూ.45వేలు అన్నారు, నలుగురు ఉంటే రూ.60 వేలు ఇస్తామన్నారు. ఎంతమంది పిల్లన్నైనా కనాలని చంద్రబాబుగారు పిలుపుకూడా ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అయ్యింది. ఇప్పటివరకూ ఒక్కపైసా ఇవ్వలేదు కదా, గతంలో ఉన్న అమ్మ ఒడి పథకాన్నీ ఆపేశారు. బడ్జెట్లో రూ.12,450 కోట్లు పెట్టాల్సి ఉండగా పెట్టలేదు. మరి ఈ డబ్బులు ఎప్పుడు ఇస్తారు? ఆ హామీని అమలు చేయకపోవడంతో తల్లిదండ్రులమీద పిల్లల ఖర్చులు, వారి భారం పడుతోంది కదా? నిన్నటి పేరెంట్స్ కమిటీ సమావేశాల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్‌కళ్యాణ్, విద్యా శాఖమంత్రిగా లోకేష్ అసలు దీని గురించి ఎందుకు మాట్లాడలేదు? ఇది దగాచేయడం కాదా? ఒక్కమాట కూడా మాట్లాడ్డంలేదంటే తల్లిదండ్రులకు సున్నం పెడుతున్నట్టే కదా" అని జగన్ ప్రశ్నించారు.

**సీబీఎస్ఈని ఎందుకు రద్దుచేశారు**

"అధికారంలోకి రాగానే స్కూళ్ల బాగుకోసం వైఎస్సార్‌సీపీ చేసిన మంచి పనులన్నింటినీ కూడా నిలిపేశారు. మలిదశలో మిగిలిపోయిన నాడు-నేడు పనులను ఉద్దేశపూర్వకంగా ఆపేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలనూ పట్టించుకోలేదు. ఏ కారణంతో నిలిపేశారు.. ఎందుకు నిలిపేశారు.. ఎంతో కష్టపడి స్కూళ్లకు సీబీఎస్ఈ అఫిలియేషన్ తీసుకు వచ్చాం. ఇప్పుడు సీబీఎస్ఈని ఎందుకు రద్దుచేశారు. ఇంగ్లిషు మీడియం బోధనను ఎందుకు నిరుత్సాహపరుస్తున్నారు? ప్రపంచస్థాయిలో గవర్నమెంటు స్కూలు పిల్లలను తయారుచేసేలా 3వ తరగతి నుంచి ప్రవేశపెట్టిన టోఫెల్ క్లాసు, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ల విధానం, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం, ఫ్యూచర్ టెక్నాలజీపై తరగతులు.. ఇలా ఇవన్నీ ఎందుకు ఆపేశారు? డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చే ట్యాబుల పంపిణీని ఎందుకు రద్దుచేశారు? 3వ తరగతినుంచే సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్‌ను ఎందుకు రద్దుచేశారు? మేం స్కూళ్లలో 6వ తరగతి నుంచే ప్రతి క్లాసులోనూ, ప్రతి స్కూల్‌లోనూ పెట్టిన ఐఎఫ్‌పీ ప్యానెల్స్, డిజిటల్ స్క్రీన్ల సమర్థ వినియోగంకోసం ఫైనల్ ఇయర్ ఇంజినీరింగ్ స్టూడెంట్‌ను ప్రతి స్కూలుకూ పెట్టాలన్న కార్యక్రమాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారు? దీనివల్ల వేలమంది ఇంజినీరింగ్ స్టూడెంట్లకు ఉపాధి దొరకదా? లేకపోతే ఐఎఫ్‌పీ ప్యానెల్స్ మెయింటినెన్స్ మూలన పడదా" అని జగన్ నిలదీశారు.

**విద్యార్థుల డొక్కమాడుస్తున్నారు**

"గతంలో రోజుకో మెనూతో, ఘనంగా ఉన్న మధ్యాహ్న భోజన పథకం గోరుముద్ద కార్యక్రమం అత్యంత దారుణంగా తయారయ్యిందంటూ ఈ మీటింగ్స్‌లో పేరెంట్స్ గగ్గోలు పెట్టడం మీ చెవులకూ వినిపించిందా చంద్రబాబు. డొక్కా సీతమ్మ అనే మహా తల్లి పేరుపెట్టి చివరకు స్కూళ్లలో, హాస్టళ్లలో విద్యార్థుల డొక్కమాడుస్తున్నారు. కనీసం ఆయాలకు జీతాలు కూడా ఇవ్వడంలేదు. విద్యార్థులు అపరిశుభ్రమైన ఆహారం తిని ఆరోగ్యంపాడై ఆస్పత్రుల్లో చేరుతున్న ఘటనలు మీ ప్రభుత్వ హయాంలో కోకొల్లలు. పిల్లలు వెళ్లే గవర్నమెంటు స్కూళ్లలో టాయిలెట్ల నిర్వహణకోసం ఇచ్చే టాయిలెట్ మెయింటినెన్స్ ఫండ్, స్కూళ్ల నిర్వహణకోసం ఇచ్చే స్కూల్ మెయింటినెన్స్ ఫండ్ ఈరోజు ఏమైంది? ఆరోజు టాయిలెంట్ల మెయింటినెన్స్ గురించి గానీ, స్కూళ్ల మెయింటినెన్స్ గురించి గానీ ఎవరైనా పట్టించుకున్నారా" అని ప్రశ్నించారు.

**విద్యారంగాన్ని దిగజార్చారు..**

"అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే ఇలా ప్రభుత్వ విద్యారంగాన్ని దిగజార్చి, కావాలనే సమస్యలు సృష్టించి ఉద్దేశ పూర్వకంగా ప్రైవేటు బడులకు వెళ్లేలా చేసి, తల్లిదండ్రులు చదువు కొనుక్కునేలా వారిపై ఆర్థికభారం మోపి, ఇప్పుడు అదే పిల్లల ముందుకు, తల్లిదండ్రులకు ముందుకు వెళ్లి ఏమార్చే మాటలు చెప్పడానికి, వారిని మభ్యపెట్టడానికి సిగ్గేయడంలేదా. విద్యాదీవెన, వసతి దీవెనల కింద గతంలో విద్యార్థులకు ఇచ్చే తోడ్పాటు ఇప్పుడు లభిస్తోందా? ఈ జనవరి వస్తే నాలుగు త్రైమాసికాలుగా ఎలాంటి చెల్లింపులు లేవు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇచ్చే వసతి దీవెన, విద్యాదీవెన ఈ రెండింటికీ కలిపి ఏకంగా రూ.3,900 కోట్లు బకాయిలుగా పెట్టి, ఈరోజు పిల్లలను ఉద్ధరిస్తున్నట్టుగా మీరు చేస్తున్న డ్రామా మరో డీవియేషన్ రాజకీయం కాదా" అని జగన్ నిలదీశారు.

# ప్రహసనంగా ఆర్టీజీఎస్

**విజయవాడ :** రియల్ టైమ్ గవర్నెన్స్? ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యల పరిష్కారం, పాలనా పరమైన సమస్యల్ని పరిష్కరించడంలో టెక్నాలజీని వినియోగించడంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దేశంలో ముందుంటారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారిత పౌరసేవల్ని అందించడంలో మిగిలిన రాష్ట్రాలకు చంద్రబాబు ముందుచూపు ఆదర్శంగా నిలుస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత చంద్రనబాబు ఆలోచనలకు అనుగుణంగా ఏర్పాటైన సాంకేతిక వ్యవస్థల్లో రియల్ టైమ్ గవర్నెన్స్ ఒకటి. ప్రభుత్వ యంత్రాంగాలు, శాఖలు అన్నింటిని ఒకే తాటిపైకి తీసుకొచ్చి ఏక కాలంలో ఏ శాఖలో ఏ అంశాన్నైనా పరిశీలించేలా ఆర్టీజీఎస్ వ్యవస్థను తీర్చిదిద్దారు. క్లుప్తంగా చెప్పాలంటే విశాఖ సముద్ర తీర ప్రాంతంలో సముద్ర కెరటాలు, అటుపోట్లను కూడా వెలగపూడిలో కూర్చుని పర్యవేక్షించే అవకాశం ఆర్టీజీఎస్‌లో ఉండేది. తీర ప్రాంతాల్లో అలల తీవ్రత అధికంగా ఉన్న సమయంలో సందర్శకులు ప్రమాదానికి గురైతే ఆర్జీజీఎస్ కెమెరాల్లో పరిశీలించి విశాఖ పోలీసుల్ని అప్రమత్తం చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. 2017లో ఆర్టీజీఎస్ ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్కడి నుంచి సమావేశాలు నిర్వహించడానికి మొగ్గు చూపేవారు. ఆర్టీజీఎస్‌కు మరో కోణం కూడా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు టెక్నాలజీ వినియోగంపై ఉన్న మక్కువను కొందరు తప్పుదోవ పట్టించారనే విమర్శలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, పౌర సేవలపై ప్రజల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవడాన్ని పాలనలో భాగం చేశారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో రికార్డు స్థాయిలో సానుకూల ప్రజాభిప్రాయలు వచ్చినట్టు నివేదికలు అందేవి. తుఫానులు, ప్రకృతి విపత్తులు, నష్ట పరిహారం, పంటల నష్టం, రైతు సాయం వంటి ఏ విషయంలోనైనా 80శాతం అనుకూల ఫలితాలు వచ్చేవి. వాటిని ముఖ్యమంత్రి కూడా పరిగణలోకి తీసుకునే వారు. ప్రభుత్వం తలపెట్టిన ఏ కార్యక్రమంపై అయినా ఐవీఆర్ఎస్ , ప్రజాభిప్రాయ సేకరణ, సంతృప్తి స్థాయిలో ప్రజల మద్దతు తతంగం కొనసాగేది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు ఈ ప్రజాభిప్రాయాలకు ఏమాత్రం పొంతన ఉండేది కాదు. ఈ పొరపాటు ఎక్కడ జరుగుతుందనేది కూడా



గుర్తించలేకపోయారు. మెరుగైన పౌర సేవల కోసం నేరుగా లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఇటీవల నిర్ణయించారు. ఐవిఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలని, ఏ అంశంపైనైనా ప్రజలు చెప్పిందే ఫైనల్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో పాటు క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ఐవిఆర్ఎస్ పద్ధతిలో ఫోన్లు చేయడం ద్వారా ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకుంటోంది. లబ్ధిదారులకే నేరుగా కంప్యూటర్ బేస్డ్ ఫోన్ కాల్స్ ద్వారా ఆ పథకం వల్ల ప్రయోజనం, దాని అమలు, సేవల్లో నాణ్యత వంటి అంశాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనుంది. లబ్ధిదారుల నుంచి ఆయా పథకాల అమలుపై వారి అభిప్రాయం కోరుతూ ఐవిఆర్ఎస్ కాల్స్ వెళతాయి. ప్రజలు ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసుకుని పని చేయనుంది. ఇంటింటికీ పింఛన్లు, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల లబ్ధిదారుల నుంచి ఈ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. పింఛను సక్రమంగా ఇంటి వద్దనే అందుతుందా లేదా.....దీపం పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా వంటి ప్రశ్నల ద్వారా లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నారు. పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయం తెలుసుకోనున్నారు. ఉచిత ఇసుక విధానం అమలు, మద్యం కొత్త పాలసీ, అమ్మకాలపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పథకాలు, కార్యక్రమాలతో పాటు రానున్న రోజుల్లో రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ వంటి పలు కీలక శాఖల్లో ప్రజలు పొందుతున్న పౌరసేవలపై కూడా ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సమాచారం సేకరించనున్నారు. ప్రజల నుంచి వచ్చే ఈ సమాచారంలో ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే.. వాటికి గల కారణాలు విశ్లేషించి సేవలను మరింత మెరుగు పరచనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే విషయం ప్రాతిపదికన ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఫోన్ కాల్స్ కు ప్రజలు ఓపిగ్గా తమ అభిప్రాయాలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుతున్నారు. ఈ ఫోన్ కాల్స్ కు ప్రజలు వెచ్చించే ఒకటి రెండు నిముషాల సమయంతో ప్రభుత్వ నుంచి ఉత్తమ సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. ఈ క్రమంలో పబ్లిక్ గ్రివెన్స్‌లో ప్రజలు అందించిన ఫిర్యాదులు పరిష్కరించేసినట్టు ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయి. ఫిర్యాదులు పరిష్కరించకపోయినా, యథాతథంగా అలాగే ఉన్న వాటిని కూడా గ్రివెన్స్ రిడ్రెస్డ్ క్యాటగిరీలో చేర్చేస్తున్నారు. ఫిర్యాదుల్ని నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించాలనే నిబంధనలు ఉండటంతో పరిష్కారమైనా లేకపోయినా అర్జీలను ముగిస్తున్నారు. దీంతో ఇదంతా ప్రహసనంగా మారింది.

## తెరమీదకు రమణ ఆరాచకాలు

**శ్రీకాకుళం :** ఆంధ్రా రాజకీయాల్లో మరో అంశం సంచలనంగా మారింది. శ్రీకాకుళం జిల్లాలో ఇండియన్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడి ఇష్యూ పొలిటికల్ టర్న్ తీసుకుంది. ఈ వ్యవహారంపై వైఎస్సార్సీపీ సంచలన ఆరోపణలు చేసింది. బసవ రమణ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడి అనుచరుడని ఆరోపించింది. ఇండియన్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడు బసవ రమణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. ఆర్మీ కాలింగ్ సెంటర్ పేరుతో విద్యార్థులను చిత్ర హింసలకు గురిచేస్తున్న వీడియో వైరల్ అవుతోంది. ఈ వ్యవహారం ఇప్పుడు పొలిటికల్ టర్న్ తీసుకుంది. తాజాగా ఈ అంశంపై వైఎస్సార్సీపీ సంచలన ఆరోపణలు చేసింది. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అనుచరుడి ఘరానా మోసం బట్టబయలు. ఇండియన్ ఆర్మీ కాలింగ్ అనే సెంటర్‌ను స్థాపించి.. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ.. ఒక్కొకరి దగ్గర నుంచి రూ.5-10 లక్షల వరకూ బసవ రమణ వసూళ్లకు పాల్పడ్డాడు. శిక్షణ పేరుతో సెంటర్‌కి వచ్చిన అమ్మాయిల గదుల్లో సీక్రెట్ కెమెరాలు పెట్టి వీడియోలు రికార్డ్ చేశాడు. వాటిని అడ్డుపెట్టుకుని స్నేహితులతో కలిసి అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తున్నాడు' అని వైసీపీ ఆరోపించింది.'బసవ రమణ వీడియోలు తీస్తున్న విషయాన్ని అమ్మాయిల ఇంట్లో చెప్పిన నలుగురు కుర్రాళ్లని బంధించి.. చిత్రహింసలకు గురిచేశాడు. శ్రీకాకుళంలో మంత్రి రామ్మోహన్ నాయుడు పేరు చెప్పి.. బసవ రమణ దందాలు చేస్తున్నాడు. షాపింగ్ మాల్స్, బార్స్‌కి వెళ్లి బిల్లులు చెల్లించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఎన్నో ఏళ్ల నుంచి ఇలా దుర్మార్గాలకి పాల్పడుతున్నాడు. అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండు శంకర్‌కి సన్నిహితుడు. పాలన చేతగాకపోతే.. ఊరూరా ఇలాంటి దుర్మార్గులే రాజ్యమేలుతారు.. అనే దానికి ఇంతకంటే ఉదాహరణ కావాలా చంద్రబాబు?' అని వైసీపీ ట్వీట్ చేసింది. నిరుద్యోగ యువతను కోచింగ్ సెంటర్‌లో జాయిన్ చేయించుకొని.. వేధింపులకు గురిచేస్తున్న రమణ అరాచకాలు వెలుగులోకి చూస్తున్నాయి. ఉచితంగా ట్రైనింగ్ ఇస్తామని చెప్పి అభ్యర్థులను ఇబ్బందులు పెడుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వెంకట రమణ పేరుకే కోచింగ్ ఉచితమని ప్రకటనలు చేస్తారని.. అభ్యర్థుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తారని టాక్ ఉంది. తన సొంత పనులు అభ్యర్థులతో చేయించుకుంటారని అంటున్నారు.

## వారి నుంచి అణాపైసలతో సహా రాబడుతాం..



-మొదటిపేజీ తరువాయి

అధికారుల పనితీరు మారకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన చిత్తూరు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం ఇవాళ(ఆదివారం) జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. విద్యాశాఖ ప్రోటోకాల్ పాటించడం లేదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు కనీసం పరిగణనలోకి తీసుకోవడంలేదని మంత్రికి ఫిర్యాదు చేశారు. వైసీపీ పాలనలో ప్రజా ప్రతినిధులకు అణిగిమణిగి ఉన్న అధికారులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎందుకింత మార్పు అంటూ సూటిగా మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి ప్రశ్నించారు. జిల్లా అధికారులు పనితీరు మార్చుకోవాలని మంత్రి హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీ దగ్గు మల్ల ప్రసాద్ రావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, థామస్, ఎమ్మెల్సీ శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు.

## వారిపై నిందలు మోపిన దుర్మార్గుడు జగన్..



**పశ్చిమగోదావరి:** జగన్ పాలనలో యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి నిర్వీర్యమయ్యారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో డిసెంబర్ 15వ తేదీన సేవ్ ది గర్ల్ చైల్డ్ పేరుతో 2కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆడపిల్లలను రక్షించుకుందాం, భ్రూణ హత్యలు నిర్మూలిద్దామనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆడపిల్లలే జాతికి నిజమైన సంపద అని. ఆ సంపదను కాపాడుకోవటానికి ప్రతిఒక్కరూ కలసి రావాలని మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ఆడపిల్లలకు మేనమామ అంటూ రాష్ట్రంలో వేలాదిమంది అపహరణకు గురవుతున్నా ఏనాడూ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. ఇంటికి పెద్దన్న అవుతానంటూనే సొంత తల్లి , చెల్లెళ్లకే న్యాయం చేయలేదని మండిపడ్డారు. వారిపై పేటీఎం కూలీలతో సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో లేనిపోని నిందలు మోపిన దుర్మార్గుడు జగన్ అని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాలను అరికట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

## రంగంలోకి ఈగల్

-మొదటిపేజీ తరువాయి

కొంత సమస్య ఉంది. ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పరంగా శిక్షణ ఇస్తున్నాం.

ఈ మధ్య కాలంలో ట్వీట్ లు పెరిగాయి. వైసిపి పాపాలు బయట పడుతుంటే ట్వీట్ చాటున బయటకొస్తునారు. విజయసాయి,వైవి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు నేరాల్లో భాగస్వామ్యులు అయ్యారు అని బయట పడుతోంది. కనీస విలువలు లేని శకుని లాంటి వ్యక్తి విజయసాయి రెడ్డి. పెద్ద వాళ్ళ పై విజయసాయి మాటలు బాధకరం. కాకినాడ పోర్ట్ వ్యవహారంలో అన్ని తెలుస్తున్నాయి. వైసిపి నేతలు అందరినీ బెదిరింపులు చేశారు. బియ్యం అక్రమ రవాణా మీద సిబి సి ఐ డి దర్యాప్తు చేస్తున్నాం.

**పోలీస్ డిపార్ట్మెంట్ చక్కగాపని చేస్తోంది.**

అందుకు మౌనంగా ఉన్న వైసిపి నేతలు ట్వీట్లు చేస్తున్నారు. ఎక్కడ భూ అక్రమాలు చూసినా అందులో వైసిపి నేతలు పాత్ర ఉంది.

విశాఖ లో మాజీ ఎంపీ ఏం వి వి సత్యనారాయణ అక్రమాలు బయటకొచ్చాయి. గడిచిన ఐదేళ్లలో ఒక్క పోలీస్ స్టేషన్ నిర్వహణ చెయ్యలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాకా దృష్టి పెట్టాం. నగరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. సర్విలేన్స్ పెంచాం. రాష్ట్రంలో గంజాయి పై ఉక్కు పాదం మోపాము.

డ్రోన్ కెమెరాలతో గంజాయి గుర్తించి నాశనం చేస్తున్నాం అని పేర్కొన్నారు. రాష్ట్ర డిజిపి ద్వారకాతిరుమలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి పద్ధతుల పరిరక్షణలో రాజీలేదని ఎంతటి వారి పైన నా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు రాష్ట్రంలో పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచేందుకు అన్ని స్థాయిలలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని ప్రభుత్వ ప్రతిష్టను పెంచేందుకు పోలీసులు నిత్యం పనిచేస్తున్నారని ద్వారకా తిరుమలరావు అన్నారు రాష్ట్రంలో వైట్ కలర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎంత పెద్ద నాయకులు ఉన్న వదిలే సమస్య లేదని కఠిన చర్యలు తీసుకుంటామని డిజిపి ద్వారకా తిరుమలరావు అన్నారు ఈ కార్యక్రమంలో డీజీపీ ద్వారకా తిరుమల రావు, విశాఖ సీపీ శంఖ బ్రతభాగ్చి తదితరులు పాల్గొన్నారు.

## దూకుడే బలం

-మొదటిపేజీ తరువాయి

పార్టీని వీడిపోయినా లెక్క చేయలేదు. వెళ్లిన వాళ్లు వెళతారు.. ఉన్నవాళ్లు ఉంటారు అన్న తరహాలోనే ఆయన తన రాజకీయాన్ని కొనసాగించారు తప్పించి నేతలు వెళ్లి పోయారన్న దిగులు చెందలేదు. పవన్ కల్యాణ? ఆవేశ పరుడు. ఇది అందరూ ఒప్పుకోవాల్సిన నిజం. ఎందుకంటే ఆయనకు ప్రేమ వచ్చినా.. ద్వేషం వచ్చినా మనసులో దాచుకోలేరు. అలాంటి మనస్తత్వం కాదు. ఏదైనా బయటకు ఉన్నది ఉన్నట్లు కక్కేసే వ్యక్తిత్వం ఉన్న నేత కావడంతోనే ఆయనను ప్రేమించే వాళ్లు భయపడుతున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. చంద్రబాబు నాయుడుతో పాటు మరో 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కానీ భవిష్యత్ లో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఎలా ఉంటాయో ముందే ఊహించలేం. ఎందుకంటే... చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ప్రయోజనాలు ఎంత ముఖ్యమో.. అదే సమయంలో పార్టీ పదికాలాల పాటు ఉండాలన్న ఉద్దేశ్యం కూడా అంతే స్థాయిలో ఉంటుంది. ఈ పరిస్థితుల్లో కొన్ని నిర్ణయాలు పవన్ మనసును నొప్పించినా ఆయన బయటపడకుండా ఇంటర్నల్ మీటింగ్ లలోనే పరిష్కరించుకోవాలన్న సూచనలు వెలువడుతున్నాయి. ఎందుకంటే కూటమి ప్రభుత్వంలో నిర్ణయాలు సమిష్టిగా జరగాల్సి ఉన్నప్పటికీ, కొన్ని నిర్ణయాలు రాజకీయపరమైనవి ఉంటాయి. వాటిని చంద్రబాబు తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకోవాల్సి ఉంటుంది. తన పార్టీ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని తీసుకునే నిర్ణయాలను పవన్ విభేదించవచ్చు. అభ్యంతరాలు తెలియజేయవచ్చు. అయితే అది నాలుగు గోడల మధ్యనే జరగాలి తప్పించి బయటకు వస్తే కూటమి నవ్వుల పాలవుతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. చంద్రబాబు నాయుడు అనుభవం ఉన్న నేత కాబట్టి ఆచితూచి నిర్ణయం తీసుకుంటారు. అందులో ఎలాంటి సందేహం లేదు. ఏదైనా ఒత్తిడికి లోనై నిర్ణయం తీసుకున్నా ఆయనను మెప్పించి ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా చూడాలి తప్పించి నేరుగా ఫైర్ అవ్వకూడదన్నది ఆయన అభిమానులు ఆశిస్తున్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 09.12.24 సోమవారం

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

# ప్రకాశం

# డ్రోన్ కెమెరాతో సమర్ధవంతంగా పోలీసుల విధులు

జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్
అసాంఘిక శక్తుల అణచివేతకు కనపడని డేగ కన్నుతో
విధి నిర్వహణ చేయనున్న డ్రోన్ కెమెరా
డ్రోన్ కెమెరాను దర్శి సిఐ వై రామారావుకు అందచేసిన ఎస్పీ
పోలీసింగ్ మెరుగుపరుచుకోవడానికి డ్రోన్ కెమెరాను బహూకరించిన
ఎన్ఆర్ఐ వెంకట్రావుకు జిల్లా పోలీసుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 8)

దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన తానికొండ వెంకట్రావు (ఎన్ఆర్ఐ) స్ఫూర్తి పొంది, దర్శి సర్కిల్‌లో శాంతి భద్రతల పరిరక్షణ, విపత్తు నిర్వహణ ప్రయోజనాల కోసం దర్శి సర్కిల్‌కు స్పాన్సర్ చేయాలని ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు అత్యాధునిక సాంకేతికత కూడిన ఒక డ్రోన్ డీజేఐఏఆర్ఎస్‌ను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోలీస్‌శాఖ తన పనితీరును మెరుగుపరచుకోవడానికి అనేక ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం జరుగుతుంది. ఈ క్రమంలోనే, ఒక ఎన్ఆర్ఐ వ్యక్తి తన స్వదేశానికి సేవ చేసే ఉద్దేశంతో పోలీస్ శాఖకు ఒక డ్రోన్‌ను బహుకరించటం ఒక గొప్ప అభినందనీయమని ఎస్పీ తెలిపారు. ప్రజాసేవకు పోలీస్ వారికి సహాయకరిగా డ్రోన్ కెమెరాను బహుకరించిన తానికొండ వెంకట్రావు,కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ ఈ డ్రోన్ ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, వివిధ బందోబస్తులు, జాతరలు, ఊరేగింపుల్లో అవాంఛనీయ సంఘటనలు నిలువరించుట, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా ముందస్తుగా చర్యలు, ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రమాద స్థలాన్ని వేగంగా చేరుకొని, పరిస్థితిని అంచనా వేయవచ్చు, వరదలు, (తరువాయి 4లో...)

# రేషన్ బియ్యాన్ని పట్టుకున్న రెవెన్యూ అధికారులు



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, డిసెంబర్ 8)

మండలంలోని గుండంచర్ల గ్రామంలో అక్రమంగా బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. పెద్దారవీడు రెవెన్యూ సిబ్బంది డిప్యూటీ తాసిల్దార్ ఇబ్రహీం ఖలీల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న అక్రమ రేషన్ బియ్యాన్ని 30 క్వింటాళ్లను స్వాధీనం చేసుకున్నట్టు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఈ నేపథ్యంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వారి ఆదేశాల ప్రకారం పెద్దారవీడు మండలంలోని గుండం చర్ల గ్రామంలో దూదేకుల కాసిం వలి చిన్న నాగయ్య వారి ఇంట్లో బియ్యం అక్రమంగా నిలువు ఉన్నాయని సమాచారం తెలుసుకున్న రెవిన్యూ సిబ్బంది హుటా హుటిన గుణం చర్ల గ్రామానికి వెళ్లి 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ పెద్దారవీడు మండలంలోని 19 పంచాయతీల్లో రేషన్ డీలర్లు అక్రమంగా రేషన్ బియ్యాన్ని అమ్మినట్లు తెలిస్తే రేషన్ షాప్ పై కఠిన చర్యలు తీసుకోవాలి వస్తుందన్నారు. రేషన్ బియ్యాన్ని ఎవరైనా కొనుగోలు చేసినా వారికి కఠిన శిక్ష పడుతుందన్నారు.

# సైనికుల త్యాగాలకు విలువ కట్టలేము

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)

నేవీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ ఈ మూడు విభాగాల వల్ల భారతదేశం సురక్షితంగా ఉందని భారత పౌరులు నిర్భీధిగా భయం లేకుండా బ్రతుకుతున్నారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. ఒంగోలు అంబేద్కర్ భవనంలో నేవీ డే సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ 4






# పొదిలిలో పలు దుకాణాల్లో రూ.4.70 లక్షల చోరీ

దుకాణాలను పరిశీలించిన సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన
వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీమ్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిశంబర్ 8)

పట్టణంలోని జూనియర్ కాలేజీ రోడ్డులోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పలు దుకాణాల్లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. షట్టర్ తాళాలు పగలగొట్టి దుకాణంలోకి ప్రవేశించిన దుండగులు బంగారం కొనుగోలు కోసం దుకాణంలో ఉంచిన రూ.4.70 లక్షల నగదును తీసుకెళ్ళారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ప్రతి రోజు లాగే శనివారం కూడా దుకాణం మూసివేసి వెళ్ళానన్నారు. ఆదివారం ఉదయం పక్క దుకాణ యజమాని వచ్చి తన దుకాణం షట్టర్ కొంత మేర తీసి ఉందని తనకు సమాచారం అందించాడని యజమాని కోటి మీడియాకు తెలిపాడు. హుటాహుటిన షాపు వద్దకు వెళ్ళి (తరువాయి 4లో...)






# పొదిలిలో పలు దుకాణాల్లో
# రూ.4.70 లక్షల చోరీ





పరిశీలించగా షట్టర్ తాళాలు పగలగొట్టి కొంత మేర షట్టర్ తీసి ఉన్న విషయాన్ని పోలీసులకు తెలియజేశానన్నారు. అనంతరం పోలీసులు దుకాణం వద్దకు చేరుకుని షట్టర్ తెరిచి లోపలికి వెళ్ళామని కోటి తెలిపారు. వెంటనే తాను దాచిన నగదును చూడగా లేకపోవడంతో నగదు దొంగలించినట్లు ఎస్ఐ వి వేమనకు తెలిపారు. దుకాణాన్ని పరిశీలించిన ఎస్ఐ వేమన అనంతరం ఒంగోలు నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి వివరాలు సేకరించారు. బాధితుడు కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పక్క దుకాణాన్ని కూడా దుండగులు షట్టర్ తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నించారని, తాళాలు పగలకపోవడంతో వెళ్ళిపోయినట్లు తెలిపారు. మరో కిళ్ళీ దుకాణషాపు షట్టర్ పగలగొట్టి రూ.2500 నగదును దోచుకెళ్ళినట్లు షాపు యజమాని తెలిపారు.

## డ్రోన్ కెమెరాతో సమర్ధవంతంగా పోలీసుల విధులు

భూకంపాలు వంటి విపత్తు సమయంలో డ్రోన్‌లను ఉపయోగించి మిస్సింగ్ అయిన వ్యక్తులను వెతకడం, సహాయక చర్యలను నిర్వహించడం వంటి పనులు, తీర ప్రాంత గస్తీకి, హైవేలపై బైక్ రేసులు అరికట్టుట, ఈవ్ టీజింగ్ సర్వేలన్స్, మాదకద్రవ్యాలు విక్రయించడం, సేవించడం, నాటుసారా తయారీ, పేకాట స్థావరాలు, బహిరంగ, పబ్లిక్ ప్రదేశాల్లో మద్యపానం వంటి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాల ద్వారా పగలు, రాత్రుళ్ళు నిఘా నిర్వహించి వాటిని నియంత్రించడంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి సీఐ రామారావు, ఐటీ కోర్ ఇన్స్‌పెక్టర్ సూర్యనారాయణ, దర్శి ఎస్ఐ మురళి, పిసిఆర్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.









## కొప్పవరపు సత్యాలు కుమార్తె వివాహ వేడుకలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 8)**
కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి అత్యంత ఆప్తులు అయిన కొప్పరపు సత్యాలు కుమార్తె వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ యారవ శీను, పామూరు పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు పందిటి హరీష్, ఉగ్ర అభిమానులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## హిందువుల పై జరుగుతున్న దాడులు ఆపాలి



**(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 8)**
పట్టణంలోని చౌక్ సెంటర్‌లో హిందూ బంధువులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ మధ్య బాంగ్లాదేశ్‌లో హిందువులపై అనేక దాడులు జరుగుతున్నాయని, ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇప్పటికైనా ఇలాంటివి ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడతామని తెలిపారు. అనంతరం నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ బంధువులతో పాటు కంభం ఎస్సై నరసింహారావు , పోలీసు సిబ్బందితో పాల్గొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

## టిటిడి భగవద్గీత పోటీల విజేతలకు
## బహుమతి ప్రధానం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 8)**
తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ బుధవారం ప్రపంచవ్యాప్తంగా జరుపుకోబోతున్న గీతాజయంతి పర్వదినంను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 9 గం నుండి భగవద్గీత పోటీలు స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం రఘుపదం మండపంలో వైభవంగా జరిగాయి. భగవద్గీత 6వ అధ్యాయం ఆత్మ సంయమ యోగం లో 6,7 తరగతి విద్యార్థులు మొదటి విభాగంగా 8,9 తరగతి విద్యార్థులు రెండవ విభాగంగా, సంపూర్ణ భగవద్గీత 702 శ్లోకాలలో పెద్దవారికి పోటీలు జరిగాయి. మొదటి విభాగంలో ప్రథమ సీహెచ్ హిమజ లక్ష్మీ, ద్వితీయ ఎస్.భువన లక్ష్మీ. తృతీయ సుమ వర్షిణి. రెండవ విభాగంలో ప్రథమ వీ లేఖన, ద్వితీయ పి. ఋషిత.తృతీయ పి. సిరి సాత్విక , సంపూర్ణ భగవద్గీత పెద్దల విభాగంలో ప్రథమ పి. రాధా రాణి. ద్వితీయ పి.లలిత కుమారి. తృతీయ బి. సరోజ అనే వారు విజేతలుగా నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్,రామాయణం పుస్తకం అతిథుల చేతుల మీదుగా బహుమతులుగా స్వీకరించారు. న్యాయనిర్ణేతలుగా సోమా జయశ్రీ, జిల్లా పావని, గోలి విశ్వనాథంలు వ్యవహరించారు. అధిక సంఖ్య లో విద్యార్థులు,తల్లితండ్రులు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు. టీటీడీ అందరికీ భగవద్గీత పుస్తకాలు ఉచితంగా పంచడమైనది.మధ్యాహ్నం అందరికి అన్న ప్రసాదం దేవాలయం వారు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ అధ్యక్షులు గుడా రామ్మోహన్ , సెక్రటరీ టీవీఎస్ శర్మ , జాయింట్ సెక్రటరీ వి. చలపతి రావు , టెంపుల్ కార్యదర్శి ఎం.నరసింహరావు , సభ్యులు పొత్తూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ నిర్వహించారు.




## సైనికుల త్యాగాలకు విలువ కట్టలేము

ఆలపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా నేవీ మృతవీరులకు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు నివాళులర్పించి మాట్లాడుతూ ఆర్మీ మృతవీరుల స్థూప నిర్మాణానికి సహకరిస్తానని పేర్కొన్నారు. ఇటీవల అమరన్ అనే చిత్రాన్ని చూడడం జరిగిందని ఆ చిత్రంలో వీర సైనికుల త్యాగాలు కళ్ళకు కట్టినట్లు చూపించారని పేర్కొన్నారు. ఎన్నో పోరాటాలు చేసిన సైనికుల త్యాగాలకి విలువ కట్టలేమని అన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా తన వద్దకు రావాలని ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు రియాజ్, కిమ్స్ సిఓఓ కె అంకిరెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ అధ్యక్షులు నెప్పలి నాగేశ్వరరావు, ఎండో క్రినాలజిస్ట్ డాక్టర్ డాక్టర్ గీతా ప్రియదర్శిని , నేవీ సైనిక సంక్షేమ సంఘం సెక్రటరీ పి.వెంకటరెడ్డి, కార్యదర్శి జి.వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ తుళ్లూరి వెంకటేశ్వర్లు, పార్థసారథి, వర్కింగ్ ప్రెసిడెంట్ కే బ్రహ్మయ్య, జాయింట్ సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ మండవ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాట్య ప్రదర్శనల ద్వారా ఎంతోమంది శిష్యులను తయారు చేసిన నళినీ ప్రియ కూచిపూడి నృత్య నీకేతన్ శివకుమారి దంపతులను వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఘనంగా సత్కరించారు. కూచిపూడి నృత్య కళాకారుని కుమారి తేజ శ్రీరెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు.



## పట్టణంలో అయ్యప్ప స్వాముల భిక్షాటన



(షణ్ముఖ వెలుగు, పామూరు, డిశంబర్ 8)

పామూరు పట్టణంలో వెలసిన శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానంలో అంబళ పూజ కార్యక్రమం ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం మంగళవారం నిర్వహిస్తున్న అంబల పూజకు అయ్యప్ప స్వాములు పట్టణంలోని ప్రధాన వీధులలో ఆదివారం భిక్షాటన చేపట్టారు. అంబళ పూజ రోజు 4 వేల మందికి భిక్ష ఉంటుందని, అంబళ పూజలో ప్రప్రధమంగా 36 లక్షలతో అయ్యప్ప స్వామివారికి చేసిన బంగారు తొడుగు ను ఆరోజు స్వామివారికి అలంకరించడం జరుగుతుందని దేవస్థానం చైర్మన్లు గుత్తి వెంకటరాజా, కావిటి వెంకటసుబ్బయ్య లు తెలిపారు. అంబళ పూజ భిక్ష లో గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేసేందుకు భిక్షాటన చేస్తున్నామని గుత్తి వెంకటరాజా పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి దేవస్థానం గుత్తి వెంకటరాజా స్వామి, కోశాధికారి రాచూరి సురేష్, ఇర్రి కోటిరెడ్డి స్వామి, పోక వినోద్ స్వామి, కాకొల్లు సాయిబాబు స్వామి,అయి నీడి వెంగయ్య స్వామి, యరశింగ్ పెద కాశీ స్వామి, పావులూరి లక్ష్మీనారాయణ స్వామి, పులివర్తి రాధాకృష్ణ స్వామి భారీ సంఖ్యలో అయ్యప్ప స్వాములు భిక్షాటనలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు సిరిపురం వాసులు మృతి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 8)

పల్నాడు జిల్లాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. కాగా ఈ ఘటనలో చనిపోయింది. కావలి మండలం సిరిపురం వాసులుగా పోలీసు అధికారులు సమాచారం అందించారు. వారు కొండగుట్ట ఆంజనేయస్వామి దర్శనం చేసుకొని వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. మొత్తం ఒకే కుటుంబ సభ్యులు కార్లో ప్రయాణస్తుండగా ఈ ప్రమాదం సంభవించిం ది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారిలో తుళ్లూరు, సురేష్, వనిత, యోగాలి, వెంకటేశ్వర్లుగా పోలీసు అధికారులు గుర్తించారు. ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అనుముకున్నాయి. దీనిపై కావలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పేరెంట్స్ టీచర్స్ కమిటీ మీటింగులు పొలిటికల్ స్టంట్స్

## కూటమి ప్రభుత్వంపై విరుచుకపడ్డ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 8)

నెల్లూరు రాంజీ నగర్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ కార్యాలయంలో నగర నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాయచోటిలో ఉపాధ్యాయుడి పై విద్యార్థులు దాడి చేసి చంపడం దురదృష్టకరమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.కూటమి ప్రభుత్వం నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ కమిటీ మీటింగ్‌లు రాజకీయ సమావేశాలకు వేదికగా మారాయి. ప్రభుత్వం విడుదల చేసిన గైడ్ లైన్స్ ప్రకారం ఎక్కడా పేరెంట్స్ టీచర్స్ కమిటీ మీటింగ్‌లు జరగలేదు.సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ కమిటీ మీటింగ్‌లు ఏ విధంగా నిర్వహించాలో ప్రభుత్వమే చెప్పాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో విద్యా రంగానికి వైయస్ జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. నాడు-నేడు, అమ్మ ఒడి, విద్యా దీవెన వసతి దీవెన, మిడ్ డే మీల్స్, టోఫెల్ శిక్షణ, ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డ్స్, బైజుస్ టాబ్స్, సీబీఎస్ఈ సిలబస్ మొదలకు పథకాలతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో మెరుగైన సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటన్నింటినీ పక్కన పెట్టిందన్నారు. కనీసం నాడు నేడు పనులలో అదనపు తరగతి భవనాల కోసం వచ్చిన తలుపులు కిటికీలు కూడా పాఠశాలలకు బిగించు కోలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాక కళాశాలలో విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. అదే జగన్మోహన్ రెడ్డి గారు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న 2 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేశారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వస్తూనే ఉద్యోగులకు చెప్పిన విధంగా జగన్మోహన్ రెడ్డి ఐఆర్ ప్రకటించారని తెలిపారు. ఈరోజు కూటమి ప్రభుత్వ పాలనలో ఫీజు రీయింబర్స్మెంట్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతంలో అమ్మఒడి ద్వారా ఇస్తున్న 15 వేల రూపాయలను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇంట్లో చదువుతున్న ప్రతి బిడ్డకు తల్లికి వందనం పేరుతో 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పిప్రజలను నిలువునా ముంచారని అన్నారు. ఈరోజు ఉద్యోగస్తులు పరిస్థితి కూడా దారుణంగా ఉందని కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఐ ఆర్, డి ఏ లు క్లియర్ చేస్తామని చెప్పి నేడు ఉద్యోగస్తులకు మొండిచెయ్యి చూపారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం జీపీఎస్ పెన్షన్ స్కీమ్ తీసుకుని వస్తే.. కూటమి ప్రభుత్వం అంతకంటే మెరుగ్గా పెన్షన్ ఇస్తామని చెప్పిఈరోజు దానిపై నోరు మెదపడం లేదన్నారు. అలాగే వైసిపి ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులరైజ్ చేసేందుకు 90% కార్యచరణ పూర్తి చేస్తేకూటమి ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిచి.. విద్యా వ్యవస్థలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు అమలు చేయాలని అలాగే ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాక్షేత్రంలో కూటమి ప్రభుత్వానికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

# ఒంగోలు డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ ప్యానల్ సభ్యుల

## ఏకగ్రీవ ఎన్నిక





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 8)

ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆదేశాలతో జిల్లా ఏపీఆర్ఎస్ఏ నాయకులు పిన్నిక మధుసూదనరావు, ఆర్ వాసుదేవరావు, ఎన్వీబీ రాజేష్, ఊతకోలు శ్రీనివాసరావు, ప్రస్తుత కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు బొల్లాపల్లి సత్యసాయి, శ్రీనివాసరావు, ఇతర సభ్యుల మద్దతుతో ఈ నెల 8వ తేదీన జరిగిన ఎన్నికలలో ఒంగోలు డివిజన్ రెవిన్యూ అసోసియేషన్ ప్యానల్ 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలు డివిజన్‌లోని 12 మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, సభ్యులు అందరు పాల్గొని అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా డిప్యూటీ తహసీల్దార్లు కె వెంకటేశ్వరరావు, రామనారాయణరెడ్డిలు వ్యవహరించారు. ప్రెసిడెంట్ జి ఆంజనేయులు (తహసీల్దార్), అసోసియేటెడ్ ప్రెసిడెంట్ ఆర్ బ్రహ్మయ్య (తహసీల్దార్), వైస్ ప్రెసిడెంట్‌లు ఎండి షమీవుల్లా (డిప్యూటీ తహసీల్దార్), వైస్ ప్రెసిడెంట్ కె శివరామకృష్ణ (డిప్యూటీ తహసీల్దార్), వైస్ ప్రెసిడెంట్ ఎం గౌతమి (డిప్యూటీ తహసీల్దార్), సెక్రెటరీ కె సాయి పవన్ (డిప్యూటీ తహసీల్దార్), జాయింట్ సెక్రెటరీలు పివి రమణయ్య (మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్), కె కోటిరెడ్డి (డ్రైవర్), ఎన్ కొండయ్య (ఆఫీస్ సబ్ ఆర్డినేట్), ట్రెజరర్ డి వెంకటేశ్వర్లు (సీనియర్ అసిస్టెంట్), ఈసీ మెంబర్లుగా పి ఉపేంద్ర యాదవ్ (జూనియర్ అసిస్టెంట్), కే జయకృష్ణ (జూనియర్ అసిస్టెంట్)గా ఎన్నుకోబడ్డారు. నూతన కార్యవర్గాన్ని ఏపీ జేఏసీ నాయకులు సన్మానించారు.

# ఘనంగా మహానటి సావిత్రి జయంతి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 8)

ఆల్ ఇండియా కళారంగం పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి వారి ఆధ్వర్యంలో మహానటి సావిత్రి జయంతి ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి చల్లా నాగేశ్వరమ్మ అధ్యక్షత వహించగా గాయని శ్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, గౌరవ అతిథులుగా నాళం నరసమ్మ, బోను దుర్గ, తదితరులు పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలదండవేసి ఘనంగా నివాళులర్పించారు. తేళ్ల అరుణ మాట్లాడుతూ సావిత్రి వారునవరసాలు పలికించగల మహానటి అని ఆమెకు ఎవరూ సరి రాలేరని అన్నారు. ఈ కార్య క్రమములో ప్రముఖ గాయనీ, గాయకులు యు లక్ష్మీ తులసి, యశోద, శేషరత్నం, సుశీల, నిర్మలమ్మ, ఐ మురళీ, ఆకుల శ్రీనివాస్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, సుకుమార్, అంజిబాబు, ఎస్‌కే బాబు, టి నారాయణ, ఎన్ పాండు, తదితరులు సావిత్రికి సంబంధించిన పాటలు పాడి సభను రంజింపజేశారు.



# కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన బీబీహెచ్ విద్యార్ధి హరీష్



(షణ్ముఖ వెలుగు, చీరాల, డిశంబర్ 8)

వేటపాలెంలోని బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీలో 6వ తరగతి చదువుతున్న చింతం హరీష్ కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించాడు. దేశాయిపేట పంచాయతీ రామానగర్‌లో శ్రీ వివేక స్కూలు నందు ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో కటాస్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. బ్లాక్ బెల్ట్ సాధించడమే తన లక్ష్యంగా రెండు సంవత్సరాలుగా సాధన చేస్తున్నానని హరీష్ తెలిపాడు. గోల్డ్ మెడల్ సాధించిన హరీష్‌ను బీబీహెచ్ జూనియర్ కాలేజీ యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

# 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటా

## ఎమ్మెల్యే ఇంటూరి

## కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఫ్రెండ్లీ ఎమ్మెల్యే

## ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ కితాబు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిశంబర్ 8)**

తాను 24/7 నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడం జరుగుతుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం చెక్క వెంకట కేశవరావు







అధ్యక్షతన అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహనీయులు, అమరజీవి మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి ఆంధ్రప్రదేశ్ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడానికి తన నిండు జీవితాన్ని ఫణంగా పెట్టారన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహారదీక్ష ఫలితమే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రమని ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు. ఇంతటి మహోన్నతుడు, ఉదాత్తుడు, నిష్కలంక దేశభక్తుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు గారు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కనిగిరిలో జన్మించడం ఈ జిల్లా వాసులుగా మనందరికీ గర్వకారణమని ఎమ్మెల్యే ఇంటూరి చెప్పారు తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వాన్ని ప్రజలు ఎంతో నమ్మకంతో ఆశీర్వదించారని, కందుకూరులో స్నేహపూరిత వాతావరణంలో పరిపాలన సాగించడమే తమ అభిమతం అని ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు. నెల్లూరు జిల్లా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి కూడా గొప్ప వదాన్యుడని, మహానుభావుడని ఎమ్మెల్యే కితాబిచ్చారు. రాళ్లపాడులో 21 అడుగుల నీరు ఉన్నదని, నియోజకవర్గంలోని అన్ని చెరువులు జల కళను సంతరించుకున్నాయని, రైతాంగం ఆనందంతో ఉందని ,ఈ సందర్భంగా ఇంటూరి తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి డిసెంబర్ 15ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అమరజీవి ఆత్మార్పణ దినంగా ప్రకటించడం గొప్ప విషయం అన్నారు. మహానుభావులను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. దీనికి కారణమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి,మంత్రి నారా లోకేష్ బాబుకు ,డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు ఆయన నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ అమరజీవి విగ్రహావిష్కరణలో పాల్గొనడం తనకి ఆనందాన్ని చ్చింద న్నారు. ఆర్యవైశ్యులు అంటే తనకు వల్లమాలిన అభిమానమని, ఆర్యవైశ్యులు అత్యంత భక్తి శ్రద్ధలతో, భయభక్తులతో జీవనాన్ని సాగిస్తారని,తాను నెల్లూరులో ఏ కార్యక్రమం చేపట్టిన, వారు చేదోడు వాదోడుగా ఉంటారని, అందుకే ఆర్యవైశ్యులు అంటే తనకు విపరీతమైన ప్రేమాభిమానాలని ఆయన తెలిపారు. త్యాగమూర్తులను రాబోయే తరాలకు గుర్తుండే విధంగా వారిని స్మరించుకోవలసిన అవసరం ,ఆవశ్యకత మనపై ఉన్నదని వేమిరెడ్డి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. నిన్న రాష్ట్రవ్యాప్తంగా 45 వేల పాఠశాలలో పిటిఎం ప్రోగ్రాంలు జరిగాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి దీన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని, ముఖ్యమంత్రి రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్ళగా చూస్తూ, ముందుకు సాగుతారని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా సూపర్ సిక్స్ పథకాలు ఆగవని, ఎంపీ వేమిరెడ్డి భరోసా ఇచ్చారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్ళినప్పుడు మన ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడానికి కేంద్రం మంత్రులు ఉత్సాహాన్ని చూపుతారని, ఇది మన ముఖ్యమంత్రి పై వారికి ఉన్న గౌరవానికి సూచికని ఆయన తెలిపారు. 24 గంటలు పని చేసే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఆయన కితాబిచ్చారు. తనను, ఎమ్మెల్యే ఇంటూరిని గెలిపించిన కందుకూరు నియోజకవర్గం ప్రజలకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జనవరిలో మరొకసారి కందుకూరులో దివ్యాంగులకు సంబంధించిన ప్రోగ్రాం తాము నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమం సందర్భంగా మరల రెండవ దఫా కందుకూరు ప్రజలను కలుసుకొనే అవకాశం రానున్నందుకు ఆనందంగా ఉందని ఎంపీ. వేమిరెడ్డి తెలిపారు. అనంతరం వేమిరెడ్డిని, ఎమ్మెల్యే ఇంటూరిని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ను ఆర్యవైశ్య సోదరులు గజమాలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరు శ్రీనివాసులు, అధికారులు, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపటి భవిష్యత్తును శాసించేది నేటి బాలలే

## తల్లిదండ్రులు పిల్లల కోసం కొంత సమయం కేటాయించాలి

## జడ్పిటిసి కట్టా జ్యోతిరెడ్డి,

## కెఎస్ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత కట్టా సుధాకర్రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, డిశంబర్ 8)**

పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా పురోభివృద్ధి తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమన్వయంతోనే సాధ్యమవుతుందని నాయుడుపేట జెడ్పీటీసీ కట్టా జ్యోతి రెడ్డి, కేఎస్ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత కట్టా సుధాకర్రెడ్డి తెలిపారు. శనివారం నాయుడుపేట మండలం మేన కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కట్టా దంపతులు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యా పురోభివృద్ధికి తల్లిదండ్రుల పర్యవేక్షణ అత్యవసరమన్నారు. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమన్వయం, సమిష్టి కృషితోనే పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని, వారిమధ్య అనుబంధం కోసమే ఇటువంటి సమావేశాల ముఖ్య ఉద్దేశమ న్నారు. పాఠశాలలో ఉపాధ్యా యులు ప్రతి ఒక్క విద్యార్థిని గమనించటం సాధ్యం కాదని తల్లిదండ్రులు ప్రతిరోజు కొద్దిసేపైనా వారి పిల్లలతో కలసి కూర్చుని వారి చదువులు గురించి, పాఠశాల పరిస్థితుల గురించి చర్చించాలన్నారు. తదుపరి ఇటువంటి పేరెంట్స్ మీటింగ్స్లో ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల వెనుకబాటు తనం గురించి ఉపా ధ్యాయులతో చర్చిస్తే ఆయా విద్యార్థుల్లో పెను మార్పు కనిపి స్తుందన్నారు. ఒకే రోజులో ఒకే సారి మార్పు సాధ్యం కాదని, నిదానంగా అభివృద్ధి సాధ్యమ వుతుందన్నారు. ప్రభుత్వ పాఠ శాలల్లో అత్యుత్తమ అర్హతలు, అనుభవం గల ఉపాధ్యాయులు ఉంటారన్నారు. తల్లి దండ్రులు ప్రైవేటు పాఠశాలల వ్యామోహం వీడాలని ప్రభుత్వ పాఠశాలలను ఆదరిస్తేనే పేద ప్రజలకు విద్య చేరుతుందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అందులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య, సుబ్రహ్మణ్యం, సర్పంచ్ సురేష్, పంచాయతీ సెక్రటరీ అశోక్, ఉప సర్పంచ్ సురేష్, ఉపాధ్యాయులు ఆనందరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

## చాకచక్యంగా పట్టుకున్న తడ పోలీస్ సిబ్బంది



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, డిశంబర్ 8)**

తిరుపతి జిల్లా తడ మండలం చేనుగుంట వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తడ పోలీసులు పట్టుకోవడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే చేనుగుంట నుండి నాయుడుపేట మీదగా వెల్తున్న అక్రమ రేషన్ బియ్యం రవాణా లారీని తడ ఎస్ఐ ఆదేశాల మేరకు స్టేషన్ పోలీసులు శనివారం రాత్రి చేనుకుంట వద్ద బీట్ వేసి చాకచక్యంగా పట్టుకోవడం జరిగింది, పట్టుకున్న లారీ నంబర్ ఏపీ 35వై 5598, డ్రైవర్ కొండూరు శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు..విచారణలో సంబధిత లారీ సూళ్లూరుపేటకు చెందిన ప్రతాప నాయుడుదిగా తెలిసింది. డ్రైవర్ కొండూరు శ్రీనివాసులు. అతనిది నాయుడుపేట వద్ద గల పుదూరు గ్రామంలో నివాసిగా సమాచారం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని రేషన్ బియ్యం పెద్ద స్కామ్గా తయారైందని, రేషన్ బియ్యం అనేది బడా వ్యాపారస్తులు రేషన్ బియ్యం చేతుల్లోకి పోతున్నాయని, రేషన్ బియ్యం వ్యాపారంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని , రేషన్ బియ్యం అక్రమ రవాణాలను అరికట్టాలని నిజమైన పేదలకు రేషన్ బియ్యం చేరాలని తెలియజేసిన విషయం తెలిసిందే. ఇలాంటి అక్రమాలు జరగడం మంచిది కాదని, ఇలాంటి నేరాలను ఉపేక్షించేది లేదని, పేదలకు వారి ఆకలి తీర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కిలో రెండు రూపాయలకి రేషన్ బియ్యం పథకం తప్పు దోవలో పట్టి పడా బాబుల చేతిలోకి వెళ్ళిపోతుందని కూడా అన్నారు. దీనిని అరికట్టడంలో వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగస్తులు అధికారులు విఫలమవుతున్నారు. ఈ అక్రమ రవాణాను తడ ఎస్ఐ చాకచక్యంగా వ్యవహరించి పట్టుకోవడం జరిగినది. ఈ దాడిలో తడ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక్బాల్ను పరామర్శించిన విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 8)**

నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇక్బాల్ను పరామర్శించారు. కొద్దిరోజుల క్రితం మహమ్మద్ ఇక్బాల్ అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రేడ్డి రంగారెడ్డి ఆయనను పరామర్శించి ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. ఇక్బాల్ను పరామర్శించిన వారిలో ఏపీ స్టేట్ ఎంఎస్ఎమ్ఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్ ఉన్నారు.



# పాలకులు మారుతున్నా మా బతుకులు మారడం లేదు

## భీమవరం ఎస్సీ రైతుల ఆవేదన

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 8)**

ఉలవపాడు మండల పరిధిలోని భీమవరం గ్రామంలో 1990 సంవత్సరం కలెక్టర్ అబ్బన్న టైంలో ఎస్సీ కాలనీ హరిజనవాసులకు 48 ఎకరాలు 90 మందికి 53 సెంట్లు లెక్కన డ్రీ పట్టా ఇచ్చి ఉన్నారు. అయితే దానిని సాగు చేసుకునే క్రమంలో 171, 174 సర్వే నెంబరు అందులోనుండి ఉత్తరం వైపు చుక్కల బాట నాలుగు అడుగులు సర్వే రికార్డులు ఇచ్చి ఉన్నారు. కానీ 171, 174 అగ్రకులాలకు చెందిన రైతులు దారి ఇవ్వడానికి అంగీకరిచమని అడ్డం తిరిగి ఉన్నారు. ఉలవపాడు మండలం సర్వేరు,, భీమవరం విఆర్వో పేరయ్య, భీమవరం విలేజ్ సర్వేరు రమేష్, భీమవరం సచివాలయ సర్వేరు రాజు, పై అధికారులు ఆర్డీవో ఉత్తర్వుల మేరకు తనిఖీకి వచ్చినారు, కానీ అగ్రకులాల రైతులు వారికి దారి మా రిజిస్ట్రేషన్ లో మా రికార్డులు లేదని వారికి చెప్పి ఉన్నారు. దారి లేకపోతే పొలం సాగు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని 90 మంది ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పాలకులు మారుతున్న మా బ్రతుకులు మాటల్లేదని ఎస్సీ రైతులు ఈ విషయాన్ని ఇంతకుముందు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరావు వద్దకు తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి నారు. ఈ సమస్యను పరిష్కరిస్తానని ఎస్సీ కాలనీ రైతులకు హామీ ఇచ్చారు. కావున మాకు రావలసిన బాటను మాకు వచ్చే విధంగా చూడమని ప్రభుత్వాన్ని ఎస్సీ రైతులు కోరుకుంటున్నారు.






# పొదిలిలో వైభవంగా ఆళ్లచెరువు వివాహ మహోత్సవం

(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిశంబర్ 8)

ఆదివారం పొదిలి పట్టణంలోని సాయి బాలాజీ కళ్యాణ మండపంలో ఆళ్లచెరువు విక్రమార్క్ శివ లీలావతి కుమారుడు (వరుడు) శివ మహేష్, ముద్దపాటి కృష్ణయ్య సుజాత కుమార్తె(వధువు) లీలావతి వివాహం వైభవంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా పొదిలి యూనిట్ గాండ్ల సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిట్టెంశెట్టి వెంకటకృష్ణారావు,దాసరి గురుస్వామి(ప్రధానోపాధ్యాయులు) ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి వరికుంట్ల వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ వివాహ మహోత్సవానికి బంధుమిత్రులు చిట్టెంశెట్టి పెద్ద సుబ్బారావు, చిన్న సుబ్బారావు,గుంటక కృష్ణ, దుడ్డ హరిప్రసాద్, శంకర్, వాసు, నలబోలు శివ, చలపతి,బీమవరపు సహదేవుడు,ఆళ్ళ చెరువు మోహన్ రావు,ఏరువ వెంకట్రామయ్య,బట్టు పిచ్చయ్య,బట్టు రామారావు,నలబోలు శివ, బూదాటి నిమ్మయ్య,చాకిరాల శేషగిరి, తెలుగుదేశం పార్టీ నాయకులు వరికుంట్ల వెంకటేశ్వర్లు (సరైనోడు) బూదాటి నిమ్మయ్య పాల్గొని వధూవరులను చిరకాలం చల్లగా ఉండాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరుల తల్లిదండ్రులు ఆళ్ళ చెరువు విక్రమార్క్ శివ లీలావతి మరియు ముద్ద పాటి కృష్ణయ్య సుజాత మాట్లాడుతూ ఈ విహహ మోహెూత్సవానికి అనేక మంది హాజరై వధూవరులను ఆశీర్వదించడం చాలా సంతోషంగా ఉందని, బంధుమిత్రులందరికీ అభినందనలు ,కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీశైలం మల్లన్న ఆలయంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యరావ ప్రత్యేక పూజలు





(షణ్ముఖ వెలుగు, పామూరు, డిశంబర్ 8)

కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రలలో ఒకటైన శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాదర స్వాగతం పలికి ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్గం శ్రీనివాసులు యారవ శ్రీనివాసులు మిత్ర బృందం పాల్గొన్నారు.

# సిద్ధార్థ హాస్పిటల్స్‌ను ప్రారంభించిన వేమిరెడ్డి దంపతులు

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 8)

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మినీ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సిద్ధార్థ ఎండోక్రైన్ అండ్ డెర్మటాలజీ హాస్పిటల్‌ను ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ , సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇతర ముఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యాన్ని వేమిరెడ్డి దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీ సీనియర్ నాయకులు జడ్. శివప్రసాద్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ఆశీసులతో నెల్లూరు నగరంలో ఒక మంచి హాస్పిటల్ ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్లు సిద్ధు నిఖిత్, ప్రీతిరెడ్డిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. చెన్నైలో దొరికే ట్రీట్‌మెంట్ ఇక నుంచి మనకు నెల్లూరులో సిద్ధార్థ హాస్పిటల్‌లో అందుబాటులో ఉందని, ప్రజలు ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ స్పెషలిస్ట్ డాక్టర్స్కు మరియు ప్రముఖులకు హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు.







# గర్నెపూడి యోబుకు 2024 తెలుగు తేజం పురస్కారం

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, డిశంబర్ 8)

ఆదరణ వెల్ఫేర్ సొసైటీ దశమ వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం మార్కాపురం నందు గోళ్ళ సత్యనారాయణ కళ్యాణ మండపంలో జాతీయ కవి సమ్మేళనం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రచయితలు, కవులు, పాల్గొన్నారు. తెలుగు భాష ప్రాధాన్యత గురించి కవి రత్న, సాహితీ వజ్ర జియో (గర్నెపూడి యోబు) గానము చేయగా, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గోటిముక్కల చెన్నకేశవులు ,వారి మిత్ర బృందం, దానరాశి ఉషారాణి, అరెకటిక నాగేశ్వరావు, ఐనకోట రవి కుమార్ చేతుల మీదుగా గర్నెపూడి యోబుకు 2024 సంవత్సరాల తెలుగు తేజం పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం, దుశ్శాలువాను కప్పి ఘనంగా సన్మానించారు. తెలుగు భాష అభివృద్ధికి చేయుచున్న కృషి అమోఘం అని వారు వర్ణించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూపర్ స్టార్ కృష్ణ కళపరిషత్ అధ్యక్షుడు జాలది మోహన్ బాబు, ప్రముఖ సాహితీ సి నారాయణస్వామి, కె ఎర్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



# నేడు వైపాలెంలో వైసిపి కార్యకర్తలు సమావేశం

## హాజరుకానున్న ఎమ్మెల్యే తాటిపర్తి

(షణ్ముఖ వెలుగు, ఎర్రగొండపాలెం ఇంచార్జి, డిసెంబర్ 8)

ఎర్రగొండపాలెం పట్టణంలోని వైష్ణవి గార్డెన్స్ లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని అన్ని మండలాల వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం 3 గంటలకు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండు కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా వైసిపి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కార్మూరు నాగేశ్వరరావు, ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులు కలిగిన వారు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# రెచ్చిపోతున్న గ్రామ సింహాలు పట్టించుకోని అధికారులు

(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 8)

కంభం పట్టణంలో శునకాలు వీరంగం సృష్టిస్తున్నా, ఈమధ్య కాలంలో చిన్న పెద్ద తేడా లేకుండా దాదాపు 500 మందికి పైగా కుక్కకాటుకి బలైనా కనీసం సంబంధిత అధికారులు స్పందించడం లేదు. పగలు,రాత్రి తేడాలేకుండా పాదచారులను, ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తూ ప్రమాదాలను గురిచేస్తున్నాయని ఎన్నోసార్లు సంబంధిత అధికారులకు కుక్కల బెడదనుండి రక్షించాలని విన్నవించుకున్నా కనీసం అధికారులు స్పందించడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రోడ్లపైనే కాకుండా కంభం పంచాయితీ, కందులాపురం పంచాయితీల లోని ప్రతి వీధిలో వందల సంఖ్యలో శునకాలు వీరంగం సృష్టిస్తున్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మమ్మల్ని శునకాల బెడదనుండి రక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.




# 26న సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాలు

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 8)

భారత కమ్యూనిస్టుపార్టీ ఒంగోలు మండల సమితి సమావేశం కరవది పార్టీ కార్యలయంలో అద్దంకి లెనిన్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ హాజరై మాట్లడుతూ పార్టీ సభ్యత్వాలు పునరుద్దరణ ఈ నెల 26వ తేదీన జరుగు పార్టీ శత జయంతి ఉత్సవాలు శాఖ ఉన్న ప్రతి గ్రామలలో ఉదయం పార్టీ జెండాలు ఏగురవేసి సాయంత్రము 3 గంటలకు ఒంగోలు అద్దంకి బస్టాండు దగ్గరనుండి భారీ ర్యాలీతో సీవీఎన్ రీడింగు రూం దగ్గర జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని ఈ సమావేశంలో వివరించారు. ఏపీ వ్యవసాయకార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటావు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి హనుమారెడ్డి సిపిఐ సినిమర్ నాయకులు పి సీతారామయ్య పాల్గొని పార్టీ శాఖ సమావేశాలు ' జరుపుకొని గామ స్థానిక సమస్యలపై ప్రభుత్వం ఎలక్షన్ ముందు ప్రకటన చేసిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయించవలసిన బాధ్యత కమ్యూనిస్టుపార్టీ ముందుండి ప్రజ సమస్యలపై పోరాడలని అన్నారు. ఈ సమావేశానికి సిపిఐ ఒంగోలు మండల కార్యదర్శి గద్దల రవి, హనుమంతరావు, పులి సురేష్, జి సుధాకర్, సీహెచ్ రమేష్, సుజాత, ఎం హనుమంతరావు, తదితరులు హాజరయ్యారు.



# ఇర్రి కృష్ణారెడ్డి కుమార్తెల పుట్టినరోజు వేడుకల్లో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల

(షణ్ముఖ వెలుగు, పామూరు, డిశంబర్ 8)

పామూరు అనిల్ గార్డెన్స్‌లో ఇర్రి కృష్ణారెడ్డి కుమార్తె పుట్టినరోజు వేడుకల్లో కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్, మాజీ పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్ని) పాల్గొని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, వైస్ సర్పంచ్ యాదల సాయి కిరణ్, అంబటి కొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ కందుల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ షైక్ చాంద్ భాషా, జొన్నలగడ్డ గోవిందయ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ నాయబ్ రసూల్, బారా షరీఫ్, సర్పంచ్ మెడబలిమి గురవయ్య, గయాజ్, ఎస్టీ సెల్ శ్రీరామ్ శ్రీనివాసులు, భూమిరెడ్డి వెంకటరెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, గడ్డం వెంకట నారాయణ రెడ్డి, చెరుకుపల్లి మోహన్‌రెడ్డి, ఇర్రి వినోద్‌రెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి, మాజీ సర్పంచ్ గోబ్బిళ్ల శ్రీనివాసులు, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, ఉడుముల లక్షినారాయణరెడ్డి, సానికొమ్మి శ్రీనివాసరెడ్డి, ముత్యాల సుధాకర్‌రెడ్డి, చెనికల వెంగళరావు, మహిళల నాయకులు సుభాషిణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.





# సంగు వారి వివాహ రిసెప్షన్‌లో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిశంబర్ 8)

కనిగిరి ఎంబీఆర్ కల్యాణ మండపంలో వైసీపీ నాయకులు సంగు సుబ్బారెడ్డి కుమార్తే సంగు మణిసంధ్య వెడ్స్ శ్రీనివాసరెడ్డిల వివాహ రిసెప్షన్‌లో కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్,జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి,వైస్ చైర్మన్ పులి శాంతి,పిసిపల్లి మండల నాయకులు పెద్దిరెడ్డి ఓకే రెడ్డి,గోపవరపు బొర్రారెడ్డి, జయరామిరెడ్డి, మూలే రాజశేఖర్ రెడ్డి,పామూరు మండలం నాయకులు అంబటి కొండారెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి, కనిగిరి రూరల్ వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతి రెడ్డి, మూలే ఏడుకొండలు,ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, కౌన్సిల్లర్ దేవకీ రాజీవ్, కనమర్లపూడి లక్ష్మీ, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, పల్నాటి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ సైకం ఏడుకొండలురెడ్డి, గోబ్బిళ్ల శ్రీను, వాకమళ్ల రాజశేఖర్‌రెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, సంగటి మహేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో భేట



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 8)

నెల్లూరు వైసీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో 48వ డివిజన్ వైసీపీ సీనియర్ నాయకులు సిద్ధిక్ ఆధ్వర్యంలో నెల్లూరు రాంజీ నగర్ లోని నగర కార్యాలయంలో భారీ స్థాయిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భేటీ అయ్యారు. ఈ సందర్బంగా అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేద్దామని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వారికి సూచించారు. డివిజన్ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార దిశగా పోరాటం సాగించాలని సూచించారు. వైసీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చుకొని జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వారికి పిలుపునిచ్చారు.



# కేంద్రం స్కీమ్... ఉచితంగా రూ.5 లక్షల హెల్త్ కార్డు





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 8)

రామలింగాపురం 19వ డివిజన్ చాకలి వీధిలో ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్యయోజన స్కీమ్, 70 సంవత్సరాలు దాటిన వృద్ధులను ఆయుష్మాన్ భారత్ పథకంలోకి ఎన్రోల్మెంట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 70 దాటిన వృద్ధులు ఆదాయంతో సంబంధం లేకుండా ఎవరైనా నమోదు చేసుకోవచ్చని, దేశంలో ఎక్కడైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నెట్వర్క్ ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రిల్లో చికిత్స చేసుకోవచ్చని , ఆయన అన్నారు. 70 సంవత్సరాలు వయసు లోపల ఉండే వారికి రేషన్ కార్డు తప్పనిసరి అని, అలాగే ఆశా వర్కర్లు ,అంగన్వాడీలకు కూడా ఈ స్కీం వర్తిస్తుందని ఆయన అన్నారు. మీ దగ్గరలో ఉన్న సీఎస్సీ, మీసేవ సెంటర్స్ లో లేదా మొబైల్ యాప్ ఇన్స్టాల్ చేసుకొని మీరే నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రామలింగాపురం మండల ప్రధాన కార్యదర్శి ముసునూరు సుబ్బారావు , ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో చదవటం మాకు ఇష్టం కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 8)

మండల కేంద్రమైన ఉలవపాడు గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ పాలకుడు డి. ఆధ్వర్యంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల చేత వివిధ రకాల నీతి కథల పుస్తకాలు చదివించడం జరిగింది. ఈ పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులలో మంచి భావనలు నాలెడ్జ్ తిరుగుతుందని విద్యార్థులను తల్లిదండ్రులు గ్రంథాలయాన్ని పంపించడం ద్వారా వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని గ్రంథాలయ పాలకుడు డి .కోటేశ్వరరావు తెలియజేశారు. అదేవిధంగా ఉలవపాడు గ్రంథాలయానికి అనుసంధానమైన చాకిచెర్ల గ్రంథాలయంలో లైబ్రరీయన్ రాణమ్మ ఆధ్వర్యంలో చదవటం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

# మార్కాపురంలో అయ్యప్ప విలక్కీ మహోత్సవం

## కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 8)

మార్కాపురంలోని అయ్యప్పస్వామి ఆలయంలో విలక్కీ మహోత్సవ ఆదివారం వైభవంగా జరగుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్ విళ్ళక్కి మహోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమం కొనసాగింది. ఈ ఉత్సవానికి అయ్యప్ప మాలధారణ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారికి అర్చకులు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు విలక్కీ ఉత్సవానికి మాజీ మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున, పి ఎల్‌పి యాదవ్, విజయరావు, నరసింహారావు, ప్రసాద్, కంభం వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com